సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 1 । మే । 2024



జగనన్నకు వెన్నుదన్నుగా..

సీఎం వైఎస్ జగన్‌కు వెన్నుదన్నుగా ముస్లిం మైనార్టీలు నిలుస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. - 8లో



కిరణ్ షో అట్టర్ ఫ్లాప్!

తంబళ్లపల్లె నియోజకవర్గంలో మంగళవారం మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన రోడ్ షోలు అట్టర్‌ఫ్లాప్ అయ్యాయి. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.190
రెండోరకం	రూ.100	రూ.140



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 310 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	240	442
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 302.720 కిలోలు

కలికిరి.. జనఝరి

వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలికిరి పర్యటన ఆ పార్టీ శ్రేణుల్లో కదనోత్సాహం నింపింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు, అభిమానులు ముఖ్యమంత్రి ప్రసంగం వినేందుకు తండోపతండాలుగా తరలి వచ్చారు. ముఖ్యమంత్రి రాకతో అందరి మోముల్లో చిరునవ్వులు విరబూశాయి. అభిమాన నేతకు అఖండ స్వాగతం పలికారు. సార్వత్రిక ఎన్నికలకు కార్యకర్తలను సన్నద్ధం చేస్తూ.. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ ముఖ్యమంత్రి చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు జనం పోటెత్తడంతో కార్యకర్తల్లో నయా జోష్ కనిపిస్తోంది.

- కలికిరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బహిరంగ సభకు పోటెత్తిన జనం
- చంద్రబాబును విమర్శించిన ప్రతి సందర్భంలోనూ జగన్‌కు జేజేలు
- మహిళా సాధికారతకు పెద్దపీట అన్నప్పుడు మహిళల నుంచి విశేష స్పందన
- నిప్పుల కొలిమిని సైతం లెక్క చేయకుండా తరలి వచ్చిన జన తరంగం
- ఎంపీగా మిథున్ రెడ్డిని, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని గెలిపించాలని జగన్ పిలుపు
- కలికిరిలో సభ సక్సెస్‌తో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం



పీలేరులో జరిగిన వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనసందోహం (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి రాయచోటి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. ఊహించని రీతిలో అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం కలికిరిలో కార్యకర్తలు కదం తొక్కారు. అడుగడుగునా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు స్వాగత హారతులు పట్టారు. ఎర్రటి సూర్యుడు నిప్పులు చెరుగుతున్నా... ఏమాత్రం లెక్క చేయకుండా మిట్ట మధ్యాహ్నం నుంచే సాయంత్రం వరకు తమ అభిమాన నాయకుడి కోసం ఎదురు చూశారు. సైనిక్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ముఖ్యమంత్రి దిగిన దగ్గర నుంచి కలికిరిలోని నాలుగు రోడ్ల సర్కిల్ వరకు ఎక్కడ చూసినా జనమే జనం కనిపించారు.

కిక్కిరిసిన కలికిరి

మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు ప్రస్తుతం పీలేరు టీడీపీ అభ్యర్థి కిశోర్ కుమార్‌రెడ్డి సొంత మండలమైన కలికిరిలో జనాలు జగన్‌కు జై కొట్టారు. పార్టీ శ్రేణులతోపాటు ప్రజలు, అన్ని వర్గాలకు సంబంధించిన వారి రాకతో వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బస్సులో నుంచే అందరికి అభివాదం చేస్తూ ముందుకు కదలి రాగా జనాలు కూడా ప్రతినమస్కారం చేస్తూ కనిపించారు. నాలుగు రోడ్ల సర్కిల్‌తోపాటు సమీపంలోని బహిరంగ సభ వద్ద కూడా ఇసుక వేస్తే రాలనంతగా జనం నిండిపోయారు. కలికిరి సభ సక్సెస్‌తో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

సీఎం ప్రసంగానికి విశేష స్పందన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాహనం మీద నుంచే ప్రసంగిస్తున్న సమయంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న ప్రతి సందర్భంలోనూ జనాలు విశేషంగా స్పందించారు. మేనిఫెస్టోతోపాటు అమలు చేయలేని హామీలను గుప్పిస్తూ మోసం చేయడానికి బాబు సిద్ధంగా ఉన్నాడంటూ చెప్పిన సందర్భంలో కార్యకర్తలంతా జగన్‌కు జై కొట్టారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో చంద్రబాబు అబద్ధపు మాటలతో పాటు 2014లో ఇచ్చిన హామీలను విస్మరించారని చెప్పి సీఎం జగన్ ఇలా ఇలా అంటుండగా కార్యకర్తలు రెండు చేతులు పైకెత్తి హామీలు నెరవేర్చలేదని ఊపారు. మహిళలకు సంబంధించి వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, అమ్మ ఒడి, నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం ఇలా అన్ని అంశాల్లోనూ మహిళలకు సాధికారత కల్పించామని సీఎం జగన్ చెప్పగానే మహిళల నుంచి మంచి స్పందన లభించింది. సభలో జగన్ మాట్లాడుతున్నంత సేపు ఆయనకు మహిళలతోపాటు యువకులు, పండుటాకులు సైతం విజయీభవ అంటూ ఆశీర్వదించడం కనిపించింది.

ఎంపీగా మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేగా చింతలను ఆశీర్వదించండి

జిల్లాలోని రాజంపేట వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థిగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా చింతల రామచంద్రారెడ్డి పోటీ చేస్తున్నారు.. ఇరువురు సౌమ్యులు, మంచి వారు.. వారిని ఆశీర్వదించాలని సీఎం జగన్ కోరినప్పుడు ప్రజలు సానుకూలంగా స్పందించారు. కచ్చితంగా ఇద్దరిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

అధికారంలోకి రాగానే హంద్రీ-నీవా పూర్తి

- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి/పీలేరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న హంద్రీ-నీవా పనులను పూర్తి చేస్తామని పీలేరు అసెంబ్లీ నియోజక వర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం కలికిరిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.హంద్రీ నీవా పనులను పూర్తి చేసి అడవిపల్లి రిజ్వాయరుకు నీరందిస్తామన్నారు. తద్వారా చెరువులకు అనుసంధానం చేసి సాగు, తాగునీరు సౌకర్యం కల్పించనున్నట్లు ప్రకటించారు. వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా గడికోట నుంచి పైపులైను ద్వారా నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి నీరందించి, ఓవర్ హెడ్‌ట్యాంకుల ద్వారా ప్రతి ఇంటికి మంచి నీరు అందించే బృహత్తర కార్యక్రమాన్ని రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. మరో పది రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయని ఎంపీగా మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిశోర్‌కుమార్‌రెడ్డిలు హైదరాబాదులో విలాసవంతమైన జీవితం గడుపుతూ ఎన్నికల ముందు పీలేరుకు వచ్చి ఏ ముఖం పెట్టుకుని ప్రజలను ఓటు అడుగుతారని ప్రశ్నించారు.

సీఎంకు ఘన వీడ్కోలు

కలికిరి ఎన్నికల పర్యటనకు విచ్చేసిన సీఎం జగన్ మోహన్ రెడ్డికి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సైనిక పాఠశాల క్రీడామైదానంలోని హెలిప్యాడ్ వద్ద ఘన వీడ్కోలు పలికారు. ఏపీఎండీపీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మైనార్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ పద్మజ, మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, రాహుల్ చక్రవర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బహిరంగ సభకు హాజరైన ప్రజలకు ఫ్యాను గుర్తు చూపిస్తున్న వైఎస్ జగన్



ముఖ్యమంత్రిని చూసిన ఆనందంలో మహిళలు



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అభిమానులు



సభలో చిన్నారి ఆనందోత్సాహం

న్యూస్‌రీల్

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ వై. చలపతి ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో చేరేందుకు అలాగే 4 నుంచి 9వ తరగతి వరకు ఉన్న బ్యాక్‌లాగ్ ఎస్టీ ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 81425 85783 లేదా 99487 88955 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆసుపత్రుల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

రాయచోటి అర్బన్: జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య తెలిపారు. మంగళవారం ఆయన డీపీఎంఓ రియాజ్‌బేగ్, డీఎస్ఎంఓ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలసి పట్టణంలోని వెంకటేశ్వర హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఏపీఏపీఎంసీఈ చట్టం - 2002 ప్రకారం ప్రొటోకాల్‌కు సంబంధించి అన్ని వసతులు ఏర్పాటు చేసుకుంటేనే ఆసుపత్రుల నిర్వహణకు అనుమతులు ఇస్తామన్నారు.

జల్లావాండ్లపల్లె వద్ద చిరుత సంచారం

కురబలకోట: మండలంలోని తెట్టు పరివాహక ప్రాంతమైన జల్లావాండ్లపల్లె గుట్టలో చిరుత పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం గుట్టపై ఉండగా స్థానికులు కనుగొన్నారు. గుట్టకు మేతకు వెళ్లిన రమణమ్మకు చెందిన రెండు మేకలు, సహదేవ రెడ్డికి చెందిన దూడను తినివేసినట్లు చెబుతున్నారు. దీంతో మేతకు పశువులు, జీవాలను గుట్టకు తోలుకెళ్లేందుకు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై మంగళవారం స్థానిక ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శివకుమార్‌ను విచారించగా హార్సిలీహిల్స్ పరిసర ప్రాంతాల్లో చిరుత ఉన్నట్లు గుర్తించామని అది ఏమైనా ఇక్కడ సంచరిస్తూ ఉండవచ్చన్నారు.

పోలింగ్‌కు కౌంట్ డౌన్!

- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు, భద్రతపై ఫోకస్
- జిల్లాలో రంగంలోకి దిగిన పోలీసు అబ్జర్వర్లు
- 1609 పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూముల తనిఖీ
- శాంతి భద్రతలు, రక్షణ చర్యలపై ఎస్పీతో భేటీ
- ఎప్పటికప్పుడు ఈసీఐకి నిఘా నివేదికలు



జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలిస్తున్న రాష్ట్ర ఎన్నికల వ్యయ పరిశీలకురాలు నినా నిగం, వివరిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్, పక్కనజిల్లా ఎస్పీ కృష్ణారావు(ఫైల్)

రాయచోటి: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో పోటీ పడుతున్న అభ్యర్థుల పేర్లు, గుర్తులు ఖరారయ్యాయి. బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా కూడా సిద్ధమైంది. రాజంపేట-24 పార్లమెంటుకు 18 మంది, పార్లమెంటు పరిధిలోని 6 నియోజకవర్గాల్లో 80 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. వీరిలో ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఉమ్మడి అభ్యర్థుల మధ్యనే పోటీ కొనసాగనుంది. ఒక్క రైల్వేకోడూరు(ఎస్సీ)లో మాత్రం వైఎస్సార్‌సీపీ - జనసేన పార్టీ అభ్యర్థుల మధ్య పోరు సాగుతోంది. అంతిమంగా బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా ఎన్నికల సంఘం ప్రకటించిన నాటి నుంచి పోలింగ్‌కు దాదాపు 12 రోజులు గడువు మిగిలింది. ఈ లోగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారం మరింత ముమ్మరం చేయనున్నారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం 6 గంటలకల్లా ప్రచారాలను నిలిపివేయాల్సి ఉంటుంది. పోలింగ్‌కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల సంఘం ఏర్పాట్లను వేగవంతం చేసింది.

ప్రశాంత వాతావరణంలో..

ముఖ్యంగా ప్రశాంత వాతావరణంలో హింసకు తావు లేకుండా గట్టి భద్రత నడుమ పోలింగ్ విజయవంతంగా ముగించాలని పోలీసు శాఖకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 1130 ప్రాంతాల్లో 1609 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేశారు. దీంతో ఏర్పాట్లను పర్యవేక్షించే క్రమంలో పోలీసు పరిశీలకులు కీలక పాత్ర వహిస్తున్నారు. ఒక పోలీసు అబ్జర్వర్‌ను ఎన్నికల కమిషన్ జిల్లాకు నియమించింది. జిల్లా పరిశీలకులుగా భారత ఎన్నికల కమిషన్ ఆదేశాలతో రిటైర్డ్ ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులైన జనరల్ అబ్జర్వర్ ఓంప్రకాష్ బంకర్, కవిత ఎస్.మనికేరి, వ్యయ పరిశీలకులు రవీందర్‌కుమార్, ఎస్.జి.మూన్, వైభవ శుక్ల, పోలీసు అబ్జర్వర్ దిల్ నవాజ్ అహ్మద్‌లు జిల్లాలో మకాం వేసి చాలా రోజులైంది. జిల్లాలో నియోజకవర్గాలు, పోలింగ్ కేంద్రాల వారీగా గతంలో 400కు పైగా పోలింగ్ కేంద్రాలలో చోటు చేసుకున్న పలు సంఘటనలకు సంబంధించి పోలీసు అబ్జర్వర్ ఆరా తీసి ఎప్పటికప్పుడు ఈసీఐకి విశ్వసనీయ నివేదిక పంపుతున్నట్లు సమాచారం. గతంలో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో జరిగిన చిన్నపాటి సంఘటనలను సైతం గుర్తించి మైక్రో అబ్జర్వర్ల ద్వారా వాటిపై నిశితంగా పరిశీలిస్తున్నారు. తిరిగి అలాంటి సంఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరు ప్రశాంతంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో అధికార వ్యవస్థ సిద్ధమైంది. ఏమైనా ఆరోపణలు, ఫిర్యాదులు వస్తే వాటిపై బాధ్యుల నుంచి వివరణ తీసుకోవడంతో పాటు జిల్లా ఎన్నికల సంఘం నివేదికను ఈసీఐ పరిశీలిస్తోంది.

ఎప్పటికప్పుడు ఈసీఐకి నివేదికలు..

జిల్లా పోలీసు అబ్జర్వర్‌గా నియమితులైన పొరుగు రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాలకు చేరుకుని అక్కడి పోలీసు ఉన్నతాధికారులతో భేటీ అవుతున్నారు. జిల్లా పరిధిలో పోలింగ్ ఏర్పాట్లు, రక్షణ చర్యలపై ఎప్పటికప్పుడు నేరుగా ఈసీఐకి నివేదికలు పంపుతున్నారు. అదేవిధంగా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కూడా పోలీసు అబ్జర్వర్లను ఎన్నికల సంఘం నియమించింది. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ వ్యయ పరిశీలకులు నీనా నిగం (రిటైర్డ్ ఐఆర్ఎస్) అధికారిణి అన్నమయ్య జిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఎన్నికల కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో జరుగుతున్న ఎన్నికల విధులపై ఆమె సంతృప్తిని వ్యక్తం చేసి ఎన్నికలు పూర్తి అయ్యే వరకు ఇదే స్ఫూర్తితో అధికారులు పని చేయాలని సూచించారు. అలాగే ఐదు రోజుల క్రితం రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పోలీసు ఎన్నికల పరిశీలకులు, ఐపీఎస్ అధికారి దిల్ నవాజ్ అహ్మద్ అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావుతో భేటీ అయ్యారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ తీసుకుంటున్న ముందస్తు చర్యలపై చర్చించారు. అదేవిధంగా అన్నమయ్య జిల్లాలో స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత, చెక్ పోస్ట్‌ను పోలీసు అబ్జర్వర్ దిల్ నవాజ్ అహ్మద్ తనిఖీ చేశారు. ఈవీఎంలకు భద్రత, కౌంటింగ్ కేంద్రాల భద్రత ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల నిర్వహణ పూర్తయ్యే వరకు భద్రత సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలపై ఎలాంటి సమస్యలు ఉన్నా 8977946222 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్




మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

రాయచోటి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సాధారణ ఎన్నికల నిర్వహణపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొత్తం 1609 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అన్నమయ్య జిల్లాకు ప్రసిద్ధి గాంచిన ఎర్రచందనం సంపదను ఒక థీమ్‌గా తీసుకొని ప్రతి మండలంలో ఒక మోడల్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. 85 శాతం ఓట్లు పోలయ్యే విధంగా ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే దాదాపు 12 నుంచి 15 వేల మందికి పోస్టల్ బ్యాలెట్లు ఇచ్చామన్నారు. జిల్లాలో 856 మంది 85 సంవత్సరాలుపైబడిన వారికి హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించామన్నారు. హోమ్ ఓటింగ్ మే 3వ తేదీన మొదలు పెట్టి మూడు, నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. మే 2వ తేదీ నుంచి ప్రతి నియోజకవర్గంలో బీఎల్ఓల ద్వారా ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికలలో ప్రతి ఒక్కరూ సహకరించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ సత్యనారాయణ, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

పోలింగ్ ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర అత్యంత కీలకమైందని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఓంప్రకాష్ బంకర్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని సుధా కన్వెన్షన్ హాల్‌లో సాధారణ ఎన్నికలు -2024లో భాగంగా మైక్రో అబ్జర్వర్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల నిర్వహణలో వారికి కేటాయించిన విధులు, బాధ్యతల పట్ల పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. జనరల్ అబ్జర్వర్ కవిత మన్నికేరి, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు వైభవ్ శుక్ల, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ మాట్లాడారు.

అభ్యర్థులు ఎంసీసీ నిబంధనలు పాటించాల్సిందే



ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులందరూ కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలను పాటిస్తూ.. ఖర్చులకు సంబంధించిన నివేదికలను నిర్దేశిత కాలంలో తప్పనిసరిగా దాఖలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ రాజంపేట పార్లమెంట్ బరిలో నిలిచిన అభ్యర్థులకు సూచించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై.. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఓంప్రకాష్‌బంకర్, వ్యయ పరిశీలకులు రవీందర్‌కుమార్, పోలీస్ అబ్జర్వర్ దిల్ నవాజ్‌అహమ్మద్‌లతో కలిసి అభ్యర్థులతో జిల్లా ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధివిధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థులకు రూ.95 లక్షల వ్యయ పరిమితిని ఎన్నికల సంఘం నిర్దేశించిందన్నారు. ఎన్నికలలో వారు చేస్తున్న వ్యయానికి సంబంధించి ఈ నెల 4, 8, 11వ తేదీలలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం రాయచోటి కలెక్టరేట్‌లో ఎన్నికల పరిశీలకుని వద్ద తనిఖీ చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని 909 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద స్త్రీ, పురుషులకు వేర్వేరు క్యూలైన్లు అలాగే సీనియర్ సిటిజన్లు, గర్భిణులకు, వికలాంగులకు ప్రత్యేక క్యూ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



చెన్నూరు : పులివెందుల బైపాస్ రోడ్డులోని జేసీబీ మెకానిక్ షెడ్ ప్రక్కన పొలంలో వేప చెట్టు కింద బిక్షాటన చేసే గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని మంగళవారం సాయంత్రం చెన్నూరు పోలీసులు గుర్తించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 70–75 సంవత్సరాల మధ్య ఉంటుందని, శరీరంపై ఎలాంటి గాయాలు లేవని తెలిపారు. శరీరంపై నశిమి రంగు లుంగీ ఎరుపు, తెలు రంగు టవల్ ధరించారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వడదెబ్బతో యువకుడు మృతి



శివ మల్లారెడ్డి(ఫైల్)

కొండాపురం : మండలంలోని బురుజుపల్లె గ్రామానికి చెందిన రాచుమల్లు శి మల్లారెడ్డి(30) వడ దెబ్బతో మృతిచెందిన ఘటన మంగళవారం చోటుచేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. బురుజుపల్లె గ్రామానికి చెందిన రాచమల్లు శివమల్లారెడ్డి మంగళవారం ఉదయం తోటకు వెళ్లే దారిలో ఎండ తీవ్రతకు స్పృహ కోల్పోయాడు. తాడిపత్రి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

వృద్ధురాలు...



రాములమ్మ

సింహాద్రిపురం : విపరీతమైన ఎండ వేడిమి వడదెబ్బతో మంగళవారం భూమిరెడ్డి రాములమ్మ మృతి చెందిన వైనం మంగళవారం చోటుచేసుకుంది. బంధువుల వివరాల మేరకు.. మండలంలోని నంద్యాలంపల్లె గ్రామానికి చెందిన భూమిరెడ్డి రాములమ్మ (78) తమ పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో మంచంపై అలాగే కూలిపోయి ప్రాణాలు వదిలినట్లు వారు తెలిపారు.

మరో వృద్ధుడు...

ఖాజీపేట : అధికవేడిమి కారణంగా వడదెబ్బ తగిలి ఊసలపల్లి అంకయ్య (65) మృతి చెందాడు. కొత్తపేట పంచాయితీ కొత్త నెల్లూరు హరిజనవాడకు చెందిన అంకయ్య మైదుకూరుకు వెళ్లాడు. సాయిబాబా ఆలయం సమీపంలో ఉన్నపాటుగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికుల సాయంతో చికిత్స నిమిత్తం చెన్నూరు ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు.

నేటి నుంచి ఉరుసు

జమ్మలమడుగు : పట్టణంలోని హజరత్ సయ్యద్‌షా గూడు మస్తాన్ వలి దర్గా ఉరుసుకు ఏర్పాట్లుచేసినట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు ముల్లా జానీ తెలిపారు. బుధవారం సాయంత్రం నిషాతో ఉరుసు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, మే 2న గంధోత్సవం, 3న ఉరుసు, 4న జియారత్ ఉంటాయని తెలిపారు. 3న చాంద్ ఆతీఫ్ అండ్ పార్టీ, కరిష్మా అండ్ పార్టీ వారితో గొప్ప ఖవాలి పోటీలు ఉంటాయని వివరించారు.

జగనన్నకు వెన్నుదన్నుగా..



ఎంపీ, ఆకేపాటి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన పార్టీకి చెందిన ముస్లిం నేతలు, యువకులు



టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఆకేపాటి అమర్నాథరెడ్డి



వైఎస్సార్‌సీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెడ్పీటీసీ సభ్రీన్‌ముక్తియార్



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన తిమ్మారెడ్డి, తదితరులు.

రాజంపేట: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వెన్నుదన్నుగా ముస్లిం మైనార్టీలు నిలుస్తున్నారని, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మేడా భవన్‌లో షేక్ అబ్దుల్ లతీప్ తోపాటు 30 కుటుంబాల వారంతా వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. ఎంపీతోపాటు ఆకేపాటి అనిల్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ముస్లీం సంక్షేమానికి దివంగత సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, అదే విధంగా ఆయన తనయుడు సీఎం వైస్.జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారన్నారు. పార్టీలో చేరిన షేక్ అబ్దుల్ మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకున్న క్రమంలో తామంతా జనసేన, టీడీపీని వీడుతున్నామని బహిరంగంగా వెల్లడించారు. ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పీసీ యోగీశ్వరరెడ్డి, తంబెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, కూండ్ల రమణారెడ్డి, నయమతుల్లా, డొంకా సురేష్, రాము యాదవ్, అన్నంనాగేంద్ర, కలీం, పొత్తపి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సామాన్య కార్యకర్తలకు భరోసా

వీరబల్లె(రాయచోటి టౌన్ : రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్నాథరెడ్డి మండలంలోని మట్లి, తదితర గ్రామాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మట్లి గ్రామం యల్లంపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి,గాలివీటి మదన్‌రెడ్డి, గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, గాలివీటి వీరనాగిరెడ్డి ఆధ్వర్యంలో 30 కుటుంబాలకు చెందిన కార్యకర్తలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆకేపాటి అమర్నాథరెడ్డి వారికి కండుడా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో సామాన్య కార్యకర్తలను సైతం అభ్యర్థులుగా నిలబెట్టిన నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించాడు. ఈ కార్యక్రమంలో సాధు రామాంజులరెడ్డి, మోడం నాగభూషణం, బండి రమణయ్య, బండి వెంకటరమణ, పుల్లగూర సతీష్, పుల్లగూర నాగభూషణం, రాజారెడ్డి, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి మళ్లీ...

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణానికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు, యువకులు పీలేరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో మూడు రోజుల కిందట టీడీపీలో చేరిపోయారు. జెడ్పీటీసీ సభ్రీన్ ముక్తియార్ మైనార్టీలతో చర్చలు జరిపి వైఎస్సార్‌సీపీ న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. మంగళవారం తిరిగి మైనార్టీలంతా వైఎస్సార్‌సీపీలో చేరడంతో జెడ్పీటీసీ సభ్రీన్ ముక్తియార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండేటి సుమలత, సిమెంట్ మురాషా, శోభనాల రమేష్, సుబ్బయ్య, ఇర్షాద్, ఆరీఫ్‌భాషా, రజాక్, ఫిరోజ్‌లు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి భారీగా చేరికలు

కురబలకోట : మండలంలోని జంగావారిపల్లెకు విచ్చేసిన తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సమక్షంలో పలువురు టీడీపీ నాయకులు మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కురబలకోట మాజీ టీడీపీ ఎంపీటీసీ టి.లక్ష్మీదేవమ్మ, ఆమె భర్త చిన్నరెడ్డెప్ప, వైవి.నిరుపమ, ఆమె భర్త వైవి.రమణారెడ్డి, సీనియర్ నాయకులు టి.భూపతి రెడ్డి (చిన్నా), దాదంవారిపల్లెకు చెందిన ప్రసాద్‌రెడ్డి, జనసేనకు చెందిన అంగళ్లు మహమ్మద్ వసీం వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ నుండి వలసలు పెరుగుతుండడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ ఎవ్వరూ చేయని విధంగా ఒక్కో ఇంటికి రూ. 3 లక్షల నుండి రూ.7 లక్షల వరకు కూడా ఈ ఐదేళ్లలో నేరుగా లబ్ధి చేకూరిందన్నారు. ఎంపీగా పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, ఎమ్మెల్యేగా తనను అఖండ మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కె. హరినాథరెడ్డి, బైసాని చంద్రశేఖర్ రెడ్డి, అరుణమ్మ, డీఆర్ ఉమాపతిరెడ్డి, బి దస్తగిరి, నులక మనోహర్‌రెడ్డి, పోరెడ్డి విశ్వారెడ్డి, ఆర్సీ ఈశ్వర్ రెడ్డి, ముద్ర దాము, ఎంపీటీసీ ఆనందరెడ్డి, సతీష్ రెడి, ప్రణయ్‌రెడ్డి, సుక్కా సుజాత, రెడ్డి కుమారి, ఆర్కే కృష్ణారెడ్డి, ఆది, చక్రపాణి, బాబి, సిద్దల శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

15 కుటుంబాలు....

కలికిరి : మండలంలోని పత్తేగడ గ్రామం కొటాలకు చెందిన టీడీపీ నాయకులు టి.శివపుత్ర, వి.పెనుపెద్దయ్య, వి.మునెయ్య, ఎం.వీరభద్రయ్య తదితరులతోపాటు 15 కుటుంబాల వారంతా మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీ పీవీ.మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు వాసునూరి వెంకటపతి ఇంటికి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాగా, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకర్‌రెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, అఫామొహిద్దీన్, మల్లికార్జున, శివాజీ, విజయ్,పాల్గొన్నారు.

టీడీపీని వీడి ....

కలకడ : కె.విపల్లె మండలంలోని గాండ్లపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ సోదరుడు తిమ్మారెడ్డి, ఆయన అనుచరులు రాము, గోవర్ధన్‌రెడ్డి, సాయి, కార్తీక్‌తో కలిసి వంద మంది మంగళవారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. రాజంపేట పార్లమెంట్ సభ్యులు పివి.మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల.రామచంద్రారెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడనై తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరీష్ రెడ్డి, డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, జివి.శ్రీనాథరెడ్డి, సుధీర్‌రెడ్డి, అవుల విష్ణువర్ధన్‌రెడ్డి, సహదేవరెడ్డి, నరసింహారెడ్డి, నల్లారి తిమ్మారెడ్డి, భాస్కర్‌నాయుడు, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



కుడమలూరులో వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి.

ఒంటిమిట్ట : మండలంలోని కుడమలూరు, కోన రాజుపల్లి గ్రామాలలో దాదాపు 300 మంది టీడీపీ కుటుంబాల వాసులు మంగళవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, రాజంపేట వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, గ్రామ పెద్దలు గుడి రమణ, గజ్జల నరసింహారెడ్డి పార్టీ కండువా వేసి వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందస్తు సూచికగా ప్రజల నుంచి మార్పు మొదలైందని, ప్రతి ఒక్కరూ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. అనంతరం రాయగుడిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నేత రమణారెడ్డిని వారు పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అంతకు ముందు ఒంటిమిట్ట పంచాయతీలోని పెద్దకొత్తపల్లి, చెంచుగారిపల్లి గ్రామాలలో రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి తనయుడు సాయి భరత్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగం రెడ్డి సుబ్బారెడ్డి, జి.శ్రీనివాసులు రెడ్డి, కత్తి సుజాత, మేరువ శివ నారాయణ, కుండ్ల ఓబుల్ రెడ్డి, లక్ష్మీ నారాయణ రెడ్డి, వెంకటరెడ్డి, ముమ్మడి నారాయణ రెడ్డి, టక్కోలు శివారెడ్డి, తేలూరి శేషారెడ్డి, మేకపాటి నందకిషోర్ రెడ్డి, ఇరగం రెడ్డి శ్రీకర్ రెడ్డి, ఏబీ నిత్యానంద రెడ్డి, మాధవరెడ్డి, గుడి రమణ, చెన్నయ్య, శ్రీనివాసులు, వెంకటరమణ, పెద్ద చిన్నయ్య, నల్లగొండ వెంకటసుబ్బారెడ్డి, పాటూరు వెంకట సుబ్బారెడ్డి, 130 మత్స్యకారుల కుటుంబాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ఏఈ

ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.32 వేలు లంచం డిమాండ్



ఏసీబీకి పట్టుబడిన కురబలకోట విద్యుత్ శాఖ ఏఈ వెంకటరత్నం

కురబలకోట : అన్నమయ్య జిల్లా ఎపీఎస్పీడీసీఎల్ కురబలకోట మండల విద్యుత్తు శాఖ ఏఈ వెంకటరత్నం రూ.32 వేలు లంచం తీసుకుంటూ కడప ఏసీబీ అధికారులకు మంగళవారం పట్టుబడ్డాడు. కడప ఏసీబీ డీఎస్పీ గిరిధర్ వివరాల మేరకు.. చింతపల్లెకు చెందిన మధుకర్ రెడ్డి ఎంబీఏ పూర్తిచేశారు. ఇంటి వద్దనే ఉంటూ తండ్రి రాజారెడ్డితో కలిసి వ్యవసాయం చేస్తున్నాడు. రాజారెడ్డి, తన సోదరుడు రఘునాథరెడ్డికి చెరో ఏడు ఎకరాల చొప్పున 14 ఎకరాల పొలం ఉంది. పక్క రైతు నీటి సాయంతో టమాటా సాగు చేశారు. ఐదు నెలల కిందట 20 హెచ్‌పీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రూ. 46,600 ఆన్‌లైన్ పేమెంట్ కట్టి విద్యుత్తు అధికారులకు దరఖాస్తు చేశారు. రెండు నెలల క్రితం స్తంభాలు సమకూర్చారు. ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని మండల ఏఈ వెంకటరత్నమంను రాజారెడ్డి కుమారుడు మధుకర్‌రెడ్డి కోరారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు రూ.35 వేలు లంచం ఇస్తే ఇస్తానని చెప్పడంతో, ఆ విషయాన్ని మధుకర్‌రెడ్డి ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. మంగళవారం ఉదయం 11 గంటలకు అంగళ్లులోని మిట్స్ కళాశాల ఎదుట టీ కేఫ్ వద్ద మధుకర్‌రెడ్డి నుంచి రూ.32 వేలు ఏఈ వెంకటరత్నం లంచం తీసుకున్నాడు. వెంటనే ఏసీబీ అధికారులు ఏఈని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు కడప ఏసీబీ డీఎస్పీ గిరిధర్ తెలిపారు. ఇతని వెంట ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులరెడ్డి, అలీ, ఎస్ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నన్ను ఇబ్బంది పెట్టాడు

మాతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లకు డబ్బు కట్టిన వారికి ముందుగా ఇచ్చాడు. నేను ఎన్నో మార్లు అడిగినా రేపురా..మాపురా.. స్టాకు లేవు..అని సాకులు చెబుతూ వచ్చాడు. చివరకు లంచం ఇస్తే ఇస్తానన్నాడు. నన్ను ఇబ్బంది పెట్టడంతో లంచం ఎందుకు ఇవ్వాలని కడప ఏసీబీ అధికారులను సంప్రదించాను. డబ్బు ఇస్తేనే పని చేస్తానని వేధించేవారికి ఇలా చేయడంలో తప్పులేదు.

– మధుకర్‌రెడ్డి, బాధిత రైతు, చింతపల్లె, కురబలకోట మండలం

కిరణ్ షో అట్టర్ ఫ్లాప్!

- కురబలకోట, బి.కొత్తకోటల్లో మమ
- కడప-బెంగళూరు రైల్వేలైన్‌పై కిరణ్ నోట అసత్యం
- టీడీపీ అభ్యర్థి అసభ్య పదజాలంపై ఆగ్రహం
- మూడు పార్టీలు కలిసినా జనంలేక నిమిషాల్లోనే ప్రసంగం



జనం లేని కురబలకోట రోడ్ షో

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట, బి.కొత్తకోటల్లో మంగళవారం మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి రోడ్ షోలు అట్టర్‌ఫ్లాప్ అయ్యాయి. మొక్కుబడిగా షోలు మమ అనిపించగా బి.కొత్తకోటలో ముస్లింలతో నిర్వహించిన సమావేశం మొక్కుబడిగా జరిగింది. ముస్లింల నుంచి స్పందన లేకపోవడంతో హాజరైన కొద్దిమందితోనే సభ నిర్వహించి ముగించారు. కిరణ్ ఎన్నికల ప్రచార పర్యటనలో భాగంగా తొలుత కురబలకోట మండలంలోని అంగళ్లు భారత్ కళ్యాణమండపం నుంచి సర్కిల్ వరకు ర్యాలీ ఉంటుందని ప్రకటించారు. తర్వాత దీన్ని రద్దు చేసుకుని జంగావారిపల్లె క్రాస్ నుంచి కురబలకోట వరకు రోడ్ షో నిర్వహించగా జన స్పందన లేదు. జనం లేని షోలో ఎంత మాట్లాడినా ఫలితం లేదని భావించిన ఆయన ప్రసంగం మూడు నిమిషాలకే పరిమితం చేసి ముగించారు. అక్కడినుంచి పెద్దతిప్పసముద్రం మండలం చెన్నరాయునిపల్లె సమీపంలో జరిగిన సభలో పాల్గొని టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డితో కలిసి బి.కొత్తకోట బీరంగిరోడ్డులో నిర్వహించిన ముస్లింల సమావేశానికి వచ్చారు. సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల మధ్య సమావేశం ఉంటుందని ముందే ప్రకటించినా స్పందన లేకపోవడంతో ఐదు గంటలు దాటాక హాజరైన కొద్దిమందితో సమావేశం ముగించారు. అక్కడి నుంచి బీరంగి రోడ్డు నుంచి జ్యోతిచౌక్ వరకు రోడ్ షో నిర్వహించగా మాజీ సీఎం స్థాయికి తగ్గట్టు జనం లేరు. మొక్కుబడిగా వచ్చిన జనంతోనే షో పూర్తి చేశారు. జ్యోతిచౌక్‌లో మాట్లాడిన కిరణ్ తన ప్రసంగాన్ని 8 నిమిషాలకే పరిమితం చేశారు. ప్రసంగాలయ్యాక జ్యోతిచౌక్ నుంచి దిగువ బస్టాండ్ వరకు రోడ్ షో కోసం బయలుదేరారు. జనంలేని కారణంగా ఒక నిమిషంలోనే షో ఆపివేయించి జీపు నుంచి దిగి కారులో వెళ్లిపోయారు. మూడు కూటమి పార్టీలు కలిసి నిర్వహించిన ఈ రోడ్ షోలకు కనీస స్పందన లేకపోయింది. ఈ పర్యటనలో మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గం దూరంగా ఉంది.

రైల్వేలైన్‌పై కిరణ్ అసత్యం

కడప-బెంగళూరు రైల్వే లైన్‌పై బి.కొత్తకోట ప్రసంగంలో కిరణ్ అసత్యాన్ని పలికారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి తొలిసారి సీఎం అయ్యాక కేంద్రం, రాష్ట్రం కలిపి 50:50 భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. పనులకు అవసరమైన ప్రభుత్వ డీకేటీ భూములను ఉచితంగా ఇస్తామని వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అప్పట్లో కేంద్రానికి లేఖ కూడా రాసింది. తర్వాత అప్పటి రాజంపేట ఎంపీ సాయిప్రతాప్‌తో కలిసి రైల్వేలైన్ పనులకు కడపలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంలోనే సాయిప్రతాప్ ఈ రైల్వేలైన్ కోసం పట్టువదలక సాధించారని, ఇది ఆయన కృషి అని కూడా కొనియాడారు. అయితే కిరణ్ కుమార్‌రెడ్డి తాను సీఎంగా ఉన్నప్పుడు కష్టపడి కడప-బెంగళూరు రైల్వేలైను సాధించానని పచ్చి అబద్ధం చెప్పారు. అంతేకాదు రూ.190 కోట్లు కేంద్రానికి చెల్లించినట్టు కూడా చెప్పుకున్నారు. అప్పుడాయన ప్రభుత్వ చీఫ్‌విప్‌గా ఉన్నారు. సీఎంగా లేరు. అయినప్పటికీ ఈ రైల్వేలైన్‌ను తాను తీసుకొచ్చినట్టు చెప్పుకున్నారు.

టీడీపీ అభ్యర్థి నోట అసభ్యపదం

బి.కొత్తకోట రోడ్ షో సందర్భంగా టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి ప్రసంగిస్తూ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిపై ఆరోపణలు చేస్తూ ఓ అసభ్య పదాన్ని వాడారు. అదే పదాన్ని రెండోసారి కూడా పలకడంతో హాజరైన జనం అవాక్కయ్యారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న వ్యక్తి నోట ఇలాంటి మాటలు రావడం సంస్కారం కాదని స్థానికులు చర్చించుకొంటున్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి గాయాలు

వేంపల్లి : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థి శివ మంగళవారం ఆందోళనలో తనంతట తాను గాయపరచుకున్నాడు. ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లోని తన హాస్టల్ గదిలో కిటికీ అద్దాలు పగులగొట్టడంతో చేతికి గాయాలయ్యాయి. తోటి విద్యార్థులు ఆర్కే వ్యాలీ అధికారులకు సమాచారం అందించగా, వారు చేరుకొని కడప రిమ్స్‌కు తరలించారు. అయితే ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు ధృవీకరించారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం విద్యార్థి శివగా గుర్తించారు. ఈ విషయంపై ట్రిబుల్ ఐటీ ఆర్కే వ్యాలీ డైరెక్టర్ ను అడగగా ఇంట్లో సమస్యలతో విద్యార్థి ఆందోళనకు గురై ఈ ఘాతుకానికి పాల్పడ్డారని చెప్పారు. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు డైరెక్టర్ తెలిపారు.


ప్రచార రథాల ధ్వంసం కేసులో ఏడుగురు అరెస్టు



మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

పీలేరు రూరల్ : పీలేరు మండల పరిధిలోని వేపుల బైలు వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ప్రచార రథాల ధ్వంసం కేసులో ఏడుగురిని అరెస్టు చేసినట్లు రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంసీసీ టీం పర్యవేక్షకులు, ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి ఫిర్యాదు మేరకు ధ్వంసం ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. అనుమానితులైన సురేష్‌కుమార్‌రెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, దీపు, కరీం, మధు, సాయి, వెంకట్రమణలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.

వాహన ధ్వంసం కేసులో ఒకరి అరెస్టు



వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య, బాధితుడు

మదనపల్లె : పట్టణంలోని ఓ హోటల్ ముందు పార్కింగ్ చేసిన స్కార్పియో వాహనాన్ని ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేసిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ కడప జిల్లా చక్రాయపేట మండలానికి చెందిన పూల నాగేంద్ర.. తన కుమారుడు, భార్యతో కలిసి స్కార్పియో వాహనంలో మదనపల్లెకు వచ్చారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో అంబేద్కర్ సర్కిల్ సమీపంలోని అంబాసిడర్ హోటల్ వద్ద పార్కింగ్ చేశారు. ఈ క్రమంలో బొమ్మనచెరువు వేంపల్లెకు చెందిన తెట్టురవి(49) ఉద్దేశపూర్వకంగా స్కార్పియో వాహనం అద్దాలు పగలగొట్టడమే కాకుండా, అడ్డు వచ్చిన వాహన యజమాని పూల నాగేంద్రను కొట్టి భయభ్రాంతులకు గురిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తెట్టురవిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.